# విశాల భారతి


తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 29.06.2025 | 24 క్యారెట్లు 1,00,750 | కిలో వెండి 1,20,000 | 26°C | సంపుటి:3 | సంచిక:182

www.vishalabharati.com



## పివికి ఘన నివాళి



**హైదరాబాద్:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. ఆర్థిక సంస్కరణల తో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచిందన్నారు.

## మోదీ ఏమిచ్చారు?

- పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై విమర్శలు గుప్పించారు
- గత ప్రభుత్వాలు హైదరాబాద్‌కు ఎన్నో ప్రాజెక్టులు తెచ్చాయని అన్నారు
- మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసిందో చెప్పాలని వెల్లడించారు
- మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ వంటి వాటికి నిధులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాలు హైదరాబాద్‌కు ఎన్నో ప్రాజెక్టులు తెచ్చాయని, మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ వంటి వాటికి నిధులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదని, అమిత్ షాను కలిసి మరోసారి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. ఈ ఫ్లైఓవర్ గచ్చిబౌలిలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుంది. పీవీ నరసింహరావు ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణకు హైటెక్ సిటీ వచ్చింది.. మన్మోహన్ సింగ్ పీఎంగా ఉన్నప్పుడు మెట్రో వచ్చింది. ఇక ఇందిరాగాంధీ హయాంలో హైదరాబాద్‌కు అనేక సంస్థలు వచ్చాయి. ఐడీఎల్, మిథాని,

మిగతా 2లో

## కౌన్ బనేగా తెలంగాణ బీజేపీ బాస్



- తెలంగాణలో ఈసారి అధికారం మాదే
- రాష్ట్రంలో మేం అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి ఎవరికీ లేదు
- తెలంగాణలోని బీజేపీ నేతలు పదే పదే చాలా ధీమాగా చెప్పే మాటలివి
- పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు
- తెలంగాణలో తమ గెలుపుపై బీజేపీకి ఉన్న అంచనాలు భారీగా పెరిగాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కీలక నిర్ణయాలను తీసుకుంటోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలను ఎవరికి అప్పగించాలనే విషయంపై దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. ఫైర్ బ్రాండ్ ముద్ర ఉన్న

మిగతా 2లో

## అమిత్ షా పర్యటనకు భారీ బందోబస్తు

- నేడు నిజామాబాద్ పసుపు బోర్డును ప్రారంభించనున్న అమిత్ షా
- పోలీసులు మునుపెన్నడూ లేనంతగా భారీ బందోబస్తు
- కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాల ఆధీనంలో పలు ప్రాంతాలు
- ఆక్టోపస్, గ్రేహౌండ్స్, స్నైపర్ టీంలతో భారీ బందోబస్తు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు ప్రారంభోత్సవంతో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం జిల్లాకు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన కోసం పోలీసులు మునుపెన్నడూ లేనంతగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాలు

మిగతా 2లో




## తెలంగాణలో 44 మంది డీఎస్పీల బదిలీ..!

- పోలీసు వ్యవస్థలో మరోసారి బదిలీల వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 44 మంది డీఎస్పీలు బదిలీ
- డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు
- డీఎస్పీలకు కొత్త నియామకాలు జరిగాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో పోలీసు వ్యవస్థలో మరోసారి బదిలీల వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్లు ఆఫ్ పోలీస్ లను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్,

మిగతా 2లో

## నన్ను రెచ్చగొట్టొద్దు


- ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో విభేదాలు భగ్గుమన్నాయి
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పార్టీలోని కొందరు నేతలపై సంచలన ఆరోపణలు చేశారు
- గాంధీభవన్‌లో మల్లు రవిని కలిసి ఆరు పేజీల లేఖను అందజేశారు
- వరంగల్ జిల్లాకు రెండు రిజర్వు స్థానాలు కేటాయించడంలో తన కృషిని గుర్తు చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు వెలుగు చూస్తున్నాయి. మరీ ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ

మిగతా 2లో



## జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయరు

2

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

4న నిరుద్యోగుల చలో సచివాలయానికి బిఆర్ఎస్ మద్దతు

పోస్టర్‌ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ నేత హరీష్ రావు

## మహాన్యూస్‌పై దాడి హేయమైన చర్య

2

దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్





## జర్నలిజం ముసుగులో నీచమైన ప్రచారం చేస్తున్నారు

- మీడియా చానెల్‌పై దాడి ఘటనపై కేటీఆర్ సంచలన ట్వీట్
- తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం
- ఈ దాడుల వెనక ఉన్న వారికి తగిన విధంగా బుద్ధి చెబుతా
- పార్టీ నాయకత్వంపై విషం చిమ్ముతున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జర్నలిజం ముసుగులో కొన్ని మీడియా సంస్థలు తనపై విషం చిమ్ముతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి విషపూరిత ప్రచారాలను ఎంతమాత్రం సహించేదిలేదని హెచ్చరించారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇలాంటి కుట్రలను తగినవిధంగా ఎదుర్కొంటామంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఓ న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'జర్నలిస్టుల ముసుగులో మీడియా సంస్థలను నడుపుతున్న కొంతమంది నీచవర్గాలు గత కొన్ని నెలలుగా నాపై, నా పార్టీ నాయకత్వంపై విషం చిమ్ముతున్నారు. వారి ప్రచారాన్ని, ఉనికిని నేను పట్టించుకోనప్పటికీ.. పదేపదే జరుగుతున్న వ్యక్తిత్వ హననం కారణంగా నా కుటుంబసభ్యులు, స్నేహితులు, పార్టీ సహచరుల ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది. నేను ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఈ వ్యవస్థీకృత ప్రయత్నాల వెనుక ఎవరున్నారో కూడా నాకు తెలుసు. వారిపైనా తగిన

మిగతా 2లో




# తెలంగాణలో 44 మంది డీఎస్పీల బదిలీ..!

మొదటి పేజీ తరువాయి

సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు సహా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న డీఎస్పీలకు కొత్త నియామకాలు జరిగాయి. అలాగే, నల్గొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, ఖమ్మం, ములుగు, మేడ్చల్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో కూడా పలువురు డీఎస్పీలను స్థానాంతరం చేశారు. ప్రధాన బదిలీల వివరాలకు వస్తే. వై. నాగేశ్వరరావు – సైబరాబాద్ సీసీఎస్ ఏసీపీగా కొనసాగుతున్న ఆయనను బదిలీ చేశారు. ఆకుల చంద్రశేఖర్ – మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా ఉన్న ఆయనకు మరో బాధ్యత అప్పగించారు. సంపత్‌కుమార్ – రాచకొండ కమాండ్ అండ్ కంట్రోల్ ఏసీపీగా ఉన్న ఆయనకు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలు కొన్ని చోట్ల పదవీకాలపు అనుభవం, సామర్థ్యంపై అధ్యయనం, మరికొన్ని విభాగీయ అవసరాల దృష్ట్యా తీసుకున్న చర్యలుగా తెలుస్తోంది. ఈ డీఎస్పీలు కొత్తగా నియమితమైన ప్రాంతాల్లో త్వరితంగా బాధ్యతలు స్వీకరించాలని డీజీపీ జితేందర్ సూచించారు.

# జర్నలిజం ముసుగులో నీచమైన ప్రచారం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి



విధంగా వ్యవహరిస్తాను' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ప్రస్తావిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ.. కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం (జూన్ 28) ఉదయం మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి చేశారు. ఆఫీసులో ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కార్యాలయం బయట నిలిపి ఉంచిన కార్లు కూడా ధ్వంసమయ్యాయి. శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్న తమపై న్యూస్ ఛానెల్ ప్రతినిధులు దాడికి పాల్పడ్డారని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆరోపించారు. దీంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణ చోటుచేసుకొని ఉద్రిక్తతలకు దారితీసిందని తెలిపారు. 'టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత కథనాలు ప్రసారం చేసిన మహా న్యూస్ ఛానెల్ ఆఫీస్ ముందు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టాం. మాపై న్యూస్ ఛానెల్ ప్రతినిధులు దాడి చేశారు. ఈ దాడిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంత మంది నాయకులు గాయపడ్డారు' అని గెల్లు శ్రీనివాస్ తెలిపారు. మహిళా జర్నలిస్ట్, టీవీ యాంకర్, కవయిత్రి స్వేచ్ఛ వోటార్కర్ మరణం పట్ల కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అకాల మరణ వార్త విని తీవ్ర ఆవేదనకు లోనయ్యానని కేటీఆర్ తెలిపారు. 'స్వేచ్ఛ ధైర్యంగా ప్రశ్నించే జర్నలిస్ట్. నిబద్ధత గల రచయిత్రి. రాష్ట్రం పట్ల అపారమైన ప్రేమ కలిగిన తెలంగాణ వాది. తెలంగాణ ఒక ప్రతిభ కలిగిన మహిళా మేధావిని కోల్పోయింది' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయరు

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జూలై 4వ తేదీన ఛలో సచివాలయం సమ్మెకు నిరుద్యోగులు పిలుపునిచ్చారని తెలిపారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా హలో నిరుద్యోగి, ఛలో సెక్రటేరియట్ సమ్మె పోస్టర్‌ని హరీష్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో విడుదల చేశారు. అనంతరం మీడియాతో హరీష్‌రావు మాట్లాడారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం సమ్మెకి సీపీఎం పార్టీ మద్దతు ఇచ్చినట్లు నిరుద్యోగులు చెప్పారని పేర్కొన్నారు హరీష్‌రావు. బీఆర్ఎస్ హయాంలో 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా మాజీ సీఎం కేసీఆర్ చొరవ తీసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న జాబ్ క్యాలెండర్‌లో ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయడం లేదని.. నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇది జాబ్ క్యాలెండర్ కాదు.. జాబ్ లెస్ క్యాలెండర్. ఇది దగా క్యాలెండర్ అని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నిరుద్యోగులకు హామీ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 12 వేల ఉద్యోగాలకు మించి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇందిర మ్మ మనమరాలుగా మాట ఇస్తున్నానని ప్రియాంకాగాంధీ యూత్ డిక్లరేషన్ ఇచ్చారని హరీష్‌రావు గుర్తుచేశారు. యూత్ డిక్లరేషన్‌లో చెప్పిన ఐదు అంశాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ ఎందుకు నెరవేర్చలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. స్కూటీ అంటే తనకు ఇష్టమని చెప్పిన ప్రియాంకాగాంధీ, మహిళ స్టూడెంట్స్‌కి ఇస్తామన్న స్కూటీ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పా లని నిలదీశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంక గాంధీ చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలవుతున్న నిరుద్యోగ భృతి ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తు న్నారని మండిపడ్డారు.

# మహాన్యూస్‌పై దాడి హేయమైన చర్య



**హైదరాబాద్:** తెలుగు న్యూస్ టీవీ ఛానల్ 'మహాన్యూస్' హైదరాబాద్ ప్రధాన కార్యాలయంపై దుండగులు శనివారం దాడి చేశారు. కర్రలు, రాళ్లతో ఆఫీస్ మీద దాడి చేసి బిల్డింగ్ అద్దాలు, కార్ల అద్దాలు పగులగొట్టారు. కర్రలతో ఆఫీస్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. మీడియాపై దాడి హేయమైన చర్య అని అన్నారు. మీడియాపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమర్థనీయం కాదని తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. పత్రికా విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని చెప్పారు. మీడియా ప్రసారాలు, కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని తెలియజేసేందుకు చట్టపరమైన మార్గాలు ఉన్నాయని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం సహించరానిదని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వాస్తవాలను ప్రజలకి వివరిస్తున్న మహాన్యూస్‌పై దాడి చేయడం అప్రజాస్వామికమని అన్నారు. మహాన్యూస్ ఛానల్‌పై జరిగిన ఈ దాడిని ప్రజాస్వామ్యవాద వాదులు అందరూ ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించి..



**సంగెం:** వడ్డీ డబ్బుల కోసం నిద్రిస్తున్న తల్లిపై ఓ కొడుకు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లిలో చోటుచేసుకున్నది. 80 శాతం కాలిన గాయాలతో దవాఖానలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటపల్లికి చెందిన ముత్తినేని వినోద, సాంబయ్యకు కుమార్తె స్వరూప, కుమారుడు సతీశ్ ఉన్నారు. సాంబయ్యకు ఉన్న మూడెకరాల భూమిని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు ఇచ్చాడు. పరిహారంగా వచ్చిన డబ్బుల్లో సతీశ్‌కు ఇవ్వగా మిగిలిన రూ.6 లక్షలను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

# కౌన్ బనేగా తెలంగాణ బీజేపీ బాస్

మొదటి పేజీ తరువాయి



బలమైన నాయకుడికి చేతికి బీజేపీ తెలంగాణ రాష్ట్రశాఖ పగ్గాలు అందడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతు పుష్కలంగా ఉన్న నాయకుల పేర్లను షార్ట్ లిస్ట్ చేసినట్లు చెబుతున్నారు. సామాజిక వర్గ సమీకరణాలను సైతం దీనికి ప్రాతిపదికగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన వారసుడిని పార్టీ ఎంపిక చేయాల్సి ఉంది. దీనికోసం సీనియర్ నేతల పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందర్ రావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, చింతల రామచంద్రారెడ్డి, మురళీధర్ రావు పేర్లు వినిపిస్తోన్నాయి.

మహిళను పార్టీ అధ్యక్షురాలిగా చేయాలనుకుంటే మహబూబ్ నగర్ లోక్ సభ సభ్యురాలు డీకే అరుణకు ఆ అవకాశం దక్కుతుందని సమాచారం. రామచంద్ర రావుతో పాటు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్.. ఈ పదవి కోసం ఫ్రంట్ రన్నర్లుగా నిలిచారు. మహిళా నాయకత్వం వైపు మొగ్గు చూపితే డీకే అరుణను ఖరారు చేయవచ్చని అంటున్నారు. జులై మొదటివారంలో తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై ప్రకటన ఉండొచ్చని తెలుస్తోంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం తెలంగాణలో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి పేరును ఖరారు చేస్తారని చెబుతున్నారు. అనుభవం ఉన్న వారికి పార్టీ పగ్గాలను ఇవ్వాలనుకుంటే ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డిని కొనసాగించడం లేదా మళ్లీ బండి సంజయ్ కు ఆ హోదాను అప్పగించడం బీజేపీ అధిష్ఠానం ముందు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు. కిషన్ రెడ్డి అదే పదవిలో కొనసాగడానికి పెద్దగా ఇష్టపడట్లేదనే ప్రచారం ఉంది. కొత్త వారిని ఎంపిక చేయాలనుకుంటే ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రాంచందర్ రావు లేదా డీకే అరుణల్లో ఒకరిని పార్టీ అధ్యక్ష పీఠం వరిస్తుంది. ఈ నలుగురిలో కూడా ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న వారిని ఎంపిక చేయడానికే పార్టీ అగ్రనాయకత్వం మొగ్గు చూపుతుది. ఆ పరిస్థితే వస్తే ధర్మపురి అరవింద్, రాంచందర్ రావులల్లో ఒకరి పేరు ఖరారవుతుంది.

# అమిత్ షా పర్యటనకు భారీ బందోబస్తు

మొదటి పేజీ తరువాయి



కొద్ది రోజుల ముందు నుంచే నగరంలో హోంమంత్రి అమిత్ షా పర్యటించనున్న ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ నిర్వహించారు. కేంద్ర బలగాల సమన్వయంతో పాటు ఆక్టోపస్, గ్రేహౌండ్స్, స్పైపర్ టీంలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతరాజు సాయి చైతన్య తెలిపారు. అమిత్ షా పర్యటన సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆయన పర్యటించే రూట్లో ఎక్కడికక్కడ పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, పోలీసు బలగాలు బైనాక్యులర్ తో అణుక్షణం పర్యవేక్షణ కొనసాగిస్తారని సీపీ సాయి చైతన్య వెల్లడించారు." "జిల్లాలోని స్పెషల్ పార్టీల టీమ్స్, బి.డి టీమ్స్, డాగ్ స్క్వాడ్స్ లతో బస్టాండ్స్, రైల్వే స్టేషన్స్ కల్వర్టులు రోడ్లు మొదలగు ప్రదేశాలలో నిశితంగా తనిఖీలు నిర్వహించి ఏరియా డామినేషన్ చేసినట్లు సీపీ తెలిపారు. గత వారం రోజుల నుంచి నగరంలోని అన్ని హోటళు ,, రెస్టారెంట్లు, రిసార్ట్ లలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యఅతిథి హోంమంత్రి అమిత్ షా పర్యటించే ప్రాంతాల్లోని అన్ని చోట్ల, చుట్టుపక్కల ఇళ్లల్లో కూడా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేస్తూ, అమిత్ షా పర్యటించనున్న 10 కి.మీ వరకు ఆయా ప్రాంతాలను పూర్తిగా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అమిత్ షా పర్యటించే ప్రాంతాల్లోని ప్రతి ఇంట్లో ఎవ్వరినీ కొత్తవారిని రానివ్వవద్దని ఇంటి యజమానులకు చెప్పడం జరిగిందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కానీ, వస్తువులు కానీ కనపడితే వెంటనే డయల్ 100 కు, లేదంటే మీ స్థానిక పోలీసులకు సమాచారం అందించడమో చేయాలని సీపీ సాయిచైతన్య నగర పౌరులకు సూచించారు." "అమిత్ షా పర్యటన నేపథ్యంలో అదిలాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్, మెదక్ ,సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి పోలీస్ సిబ్బంది, టి.ఎస్.ఎస్.పి బెటాలియన్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహణ కోసం దాదాపు 1300 మందితో ఏర్పాట్లు చేయడం జరిగిందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ పర్యటన సందర్భంగా మొదటి నుండి చివరి వరకు దారి పోడువున " సి.సి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు బైనాక్యులర్లతో కూడా పర్యటనను పూర్తిగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పాత నేరస్తులపై నిఘాను పటిష్టం చేసామన్నారు. అమిత్ షా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందికి, బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని సీపీ సాయిచైతన్య విజ్ఞప్తి చేశారు."

# నన్ను రెచ్చగొట్టొద్దు

మొదటి పేజీ తరువాయి



కొండా మురళి ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ నేతల మీద సంచలన ఆరోపణలు చేశారు. జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య వర్గ విబేధాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే నేడు కొండా మురళి గాంధీ భవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీలోని విబేధాలు, జరుగుతోన్న తాజా పరిణామాలపై క్రమశిక్షణ కమిటీకి మొత్తం ఆరు పేజీలతో కూడిన లేఖను అందజేశారు. అనంతరం గాంధీభవన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కొండా మురళి మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే.. ఏ జిల్లాలో లేని విధంగా వరంగల్ జిల్లాలో మాత్రమే రెండు స్థానాలు రిజర్వు అయ్యాయని.. అందుకోసం తాను తీవ్రంగా కృషి చేశానని తెలిపారు. భారతదేశంలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా గెలిచిన వ్యక్తి కూడా తానేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ఏళ్ల తరబడి ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకునే వ్యక్తి తానే అన్నారు కొండామురళి. అలానే కాంగ్రెస్ పెద్దలంటే తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పుకొచ్చారు. తనను ఎవరూ ప్రశ్నించలేదని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం చేసే పనిలో తాను నిత్యం బిజీగా ఉంటానని కొండా మురళి చెప్పుకొచ్చారు. అలానే తనను రెచ్చగొట్టొద్దని.. తాను మృత్యువుకు కూడా భయపడనని చెప్పుకొచ్చారు. తన బలమేంటో భారతదేశంలో అందరికీ తెలుసని.. తన శరీరంలో ఇంకా 4 బుల్లెట్లు ఉన్నాయని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేటప్పుడు.. తాను రాజీనామా చేసి వచ్చానని కొండా మురళి గుర్తు చేశారు. అది తన నిబద్ధత అని.. ఆయన స్పష్టం చేశారు. అలానే ప్రస్తుతం ఉన్న కొంత మంది నాయకుల మాదిరిగా తాను పార్టీ మారినా పదవిలో కొనసాగలేదని తెలిపారు. భారతదేశంలోనే ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగాగెలిచిన వ్యక్తి తానేనని..ఈ విషయం అందరికీ తెలుసన్నారు. అలానే తనను ఎవరూ పిలిచి.. ఈ విషయాలు వివరించమని చెప్పలేదని.. తానే పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ మీద అభిమానంతో వచ్చి వివరించానని చెప్పుకొచ్చారు.

# మోదీ ఏమిచ్చారు?

మొదటి పేజీ తరువాయి

బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఐడీఎల్, ఈసీఐఎల్ వచ్చాయి. నేడు ఫార్మ రంగంలో హైదరాబాద్‌కు పెట్టుబడులు వచ్చాయంటే ఇందిరా గాంధీ వల్లే. మరి నేను బీజేపీ నేతలను అడుగుతున్నాను.. మోదీ రాష్ట్రానికి ఏం ఇచ్చారు' అని సీఎం రేవంత్ రెడ్డి .. బీజేపీ ఎంపీ కిషన్ రెడ్డిని ప్రశ్నించారు.

'మెదక్, చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, నిజామాబాద్, కరీంగనర్, ఆదిలాబాద్ ఎంపీలు బీజేపీ వాళ్లే. తెలంగాణలో సగం ఎంపీలను మీకే ఇచ్చారు. ఈ రాష్ట్ర ప్రజలు 8 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలను బీజేపీకి ఇచ్చారు. మరి మోదీ నుంచి మీరు రాష్ట్రానికి తెచ్చింది ఒక్కటి చూపించండి' అంటూ సీఎం రేవంత్ సవాల్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కూడా మోదీ మెట్రో ఇస్తున్నారు. గుజరాత్‌కు బుల్లెట్ ట్రైన్ ఇచ్చారు. ఢిల్లీకి యమునా ఫ్రంట్ రివర్, యూపీకి నమామి గంగా ఇచ్చారు అని తెలిపారు. అదే తాము తెలంగాణ కోసం మెట్రో విస్తరణ గురించి అడిగితే ఇవ్వడం లేదన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ఇవ్వడం లేదు. రీజనల్ రింగ్ రోడ్డు అడిగితే ఇవ్వడం లేదు. మేం ఏం పాపం చేశాం.. మా మీద ఎందకీ వివక్ష అంటూ సీఎం రేవంత్ రెడ్డి.. బీజేపీ నేతలను ప్రశ్నించారు. పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర బీజేపీ నేతల మీద విమర్శనాస్త్రాలు సంధించారు.

'నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లాను. ప్రధాని నరేంద్ర మోదీతో సహా అనేకమంది కేంద్రమంత్రులను కలిశా. కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. హోం మంత్రి అమిత్ షా ఆదివారం రాష్ట్రానికి వస్తున్నారు. మరో సారి ఆయనను కలిసి రిక్వెస్ట్ చేస్తాను' అని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి



చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని వాహనదారుల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు పీజేఆర్ ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు నిర్మించిన పీజేఆర్ ఫ్లైఓవర్‌ను శనివారం నాడు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభంతో గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ చాలా వరకు తగ్గనుంది. రూ.140 కోట్ల అంచనా వ్యయంతో 2022 మార్చి 1న దీని నిర్మాణానికి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఈ సంవత్సరం జూన్ 15 నాటికి నిర్మాణం పూర్తయ్యింది. ఇప్పటికే అక్కడ రెండు ఫ్లైఓవర్లు నిర్మించగా, వాటిపై మూడో స్థాయి నిర్మాణంగా దీన్ని నిర్మించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం
29.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# దైవ దర్శనాలకు ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

## ప్రయాణికుల నుంచి విశేష స్పందన

**బోడుప్పల్: విశాలభారతి:**

దేవాలయాల దర్శనాలకు ఆర్టీసీ ప్రవేశ పెట్టిన టూర్ ప్యాకేజీకి విశేష స్పందన లభించినట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. దేవాలయాల దర్శనాలకు ఆర్టీసీ ప్రవేశ పెట్టిన ప్యాకేజీలో భాగంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి లోని పలు కాలనీల నుండి 3 బస్సు లలో ప్రయాణికులతో కలిసి ఆమే దైవ దర్శనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఈనెల 27 నుండి చెంగిచెర్ల నుంచి ఉప్పల్ మీదుగా ముచ్చింతల్ లోని అనంతపద్మనాభ స్వామి ఆలయం, కొత్తూరు మీదుగా షాద్ నగర్ లోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, అమ్ముపల్లి లోని సీతారామస్వామి ఆలయం, వెండికొండ లోని వెండికొండ సిద్ధేశ్వరస్వామి దేవాలయాల సందర్శనానికి ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. 30 నుంచి 40 మంది ప్రయాణికులు ఉంటే.. వారి కాలనీ వద్ద నుంచే బస్సు బయలు దేరుతుందని చెప్పారు. పెద్దలకు రూ.600, పిల్లలకు రూ. 300 ఛార్జీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న దేవాలయాల దర్శనాల టూర్ ప్యాకేజినీ భక్తులు వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ చెంగిచెర్ల సెల్ నెంబర్ 78930 88433 సంప్రదించాలన్నారు.

## సిసి రోడ్ నాణ్యత పరిశీలించిన కార్పొరేటర్



**నాచారం, విశాలభారతి:** మల్లాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఎదురుగా రోడ్డులో రూపాయలు 51 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను జిహెచ్ఎంసి క్వాలిటీ కాంట్రల్ నిత్యానంద బృందం తో కలిసి క్వాలిటీని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పరిశీలించారు. సిసి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సూచించారు. వినియోగిస్తున్న మెటీరియల్ కి ప్రమాణ భద్రత, నాణ్యత ఉండాలన్నారు. పనులలో వేగం పెంచి త్వరలో పూర్తి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ నాగేందర్, రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ రామారావు , బీఆర్ఎస్ నేతలు వాసు గౌడ్ , దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ , వై మల్లేష్ , నాగరాజు గౌడ్ , కర్నే మల్లేష్ ,స్థానిక కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

# పీజేఆర్ ఫ్లైఓవర్ ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి








**శేరిలింగంపల్లి-విశాల భారతి:**

హైదరాబాద్ నగరంలో మరో ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది. శిల్పాలే ఔట్ ఫేజ్ 2 ఫ్లైఓవర్ ను శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు నిర్మించిన బై డైరెక్షనల్ ఫ్లై ఓవర్ కు దివంగత కాంగ్రెస్ నేత పి. జనార్దన్ రెడ్డి(పేజేఆర్) పేరు పెట్టింది ప్రభుత్వం. ఓఆర్ఆర్ నుంచి గచ్చిబౌలి వరకు 1.2 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ బై డైరెక్షనల్ ఫ్లై ఓవర్కు రూ. 182కోట్లు ఖర్చు చేశారు. ఈ ఫ్లై ఓవర్ పై నుంచి 1.2 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 2 నిమిషాల 25 సెకన్లలో చేరుకోవచ్చు. కొత్తగూడ సమీపంలో ముగిసే ఈ ఫ్లై ఓవర్నుంచి కొండాపూర్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరుకోవచ్చు. ఇక గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. మొత్తం 4.4 కిలోమీటర్లు ఉండే ఈ రూట్లో ఓఆర్ఆర్ఎగ్జిట్ నుంచి కొత్తగూడ జంక్షన్వరకు ఉదయం,సాయంత్రం కిలోమీటర్ ప్రయాణించాలంటే దాదాపు అరగంటకు పైగానే పడుతుంది. మధ్యాహ్నం వేళలో 15 నిమిషాలు పడుతుంది. దీనివల్ల ఇంధన భారంతోపాటు వాహనదారులు ట్రాఫిక్ లో ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్నారు. అయితే,ఈ ఫ్లై ఓవర్ ప్రారంభంతో కష్టాలకు చెక్ పడనున్నది.

**ఫ్లై ఓవర్లలో అతిపెద్ద స్థానం...**

పీజేఆర్ ఫ్లైఓవర్ నగరంలోని అతిపెద్ద ఫ్లైఓవర్లలో ఒకటిగా స్థానాన్ని దక్కించుకోనుంది. సిటీలో పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే నాలుగు లేన్లతో11.66 కి.మీ తో మొదటి స్థానంలో నిలవగా, ఆరాంఘర్ ఫ్లైఓవర్ ఆరులేన్లతో 4.08 కి.మీ తో రెండో స్థానంలో ఉంది. కొత్తగూడ ఫ్లైఓవర్ నాలుగులేన్లతో 3 కి.మీ(మూడో స్థానం) , షేక్ పేట ఫ్లైఓవర్ ఆరులేన్లతో 2.71 కి.మీ(నాలుగో స్థానం), శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ ఫేజ్%-%1 నాలుగు లేన్లతో 1.75 కి.మీ (ఐదోస్థానం) ఉండగా, ఓవైసీ-మిథాని ఫ్లైఓవర్ మూడు లేన్లతో 1.40 కి.మీ (ఆరో స్థానం) ఉంది. ఆ తర్వాత పీజేఆర్ ఫ్లైఓవర్ 1.20 ఏడో స్థానంలో నిలిచింది. దీని తర్వాత బాలానగర్ ఫ్లై ఓవర్ 1.13 కి.మీతో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకుంది. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు,జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ,సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,శేరిలింగంపల్లి ఎంఎల్ఏ ఆరెకపూడి గాంధీ, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి,జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్,ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎంఎల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బోధి మొక్కలు పెంచండి.. శాంతిని పొందండి

**చర్లపల్లి, విశాలభారతి:**

బోధి మొక్కలను పెంచడం వల్ల ఖైదీలతోపాటు ప్రతి ఒక్కరూ శాంతిని పొందుతారని జైళ్ల శాఖ, కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. శనివారం చర్లపల్లి సెంట్రల్ జైల్ ఓపెన్ ఎయిర్ జైల్లో బుద్ధ వనం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్లోని బోధగయ వృక్షం కింద గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొంది పవిత్ర వృక్షం అని తెలిపారు. అదే సందర్భంగా నేరాలు, తప్పులు చేసిన వారికి జ్ఞానం, ధర్మాం చూపించే విధంగా ఉండె ఈ మహాబోధి మొక్కలను బుద్ధవనంలో నాటడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రతి ఒక్కరు తమ ఇంటిలో మహాబోధి మొక్కలను పెంచాలని కోరారు. అనంతరం సెంట్రల్ జైల్లో జరుగుతున్న పరిశ్రమలతోపాటు, ఖైదీలకు అందుతున్న ఆరోగ్య, పారిశుద్ధ లాంటి తదితర విషయాలపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు, చర్లపల్లి జైల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూస్ పంపిణీ



**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలం నీర్మాల హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరికీ జనగామ వాస్తవ్యులు మాశెట్టి శాలిని-సంతోష్ కుమార్ దంపతుల కుమారుడైన మాశెట్టి శ్రీయాన్ జన్మదినం సందర్భంగా పాఠశాల విద్యార్థులందరికి స్కూల్ షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ. కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ, మా కుమారుడు జన్మదినం సందర్భంగా మా కుమారుడిని ఆశీర్వ దించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున, ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పాఠశాల విద్యార్థులకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని ఎంతో సంతోషంగా తెలిపారు. ఈ సంతోషానికి సహకరించిన, ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం హరిజన కాలనీ నీర్మల పాఠశాల విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ వారు బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించిన పలకలను పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ పిల్లలకు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో పాఠశాల ఏఐపీసీ చైర్మన్ చంద్రకళ, అంగన్వాడి ఉపాధ్యాయులు నల్ల నిర్మల, లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.




## తడి పొడి చెత్త పై కమిషనర్ అవగాహన

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

వంద రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం ఉదయం 6.30 గంటలకు బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలోని 10వ డివిజన్ లోని కిస్మత్ పూర్, డిఫెన్స్ కాలనీ లో తడి చెత్త పొడి చెత్త, హానికారక చెత్త పై కాలనీ ప్రజలకు కమీషనర్ బి. శరత్ చంద్ర అవగాహన కల్పించారు. స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్, వెంకట్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ బి. శ్రీశైలం, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# సీసీ రోడ్ల నిర్మాణానికి లెవెల్స్ పరిశీలన

## కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ ఆటోసాయి నగర్ లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కాలనీవాసులతో కలసి సి సి రోడ్డు లెవెల్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాభోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఏఇ హేము నాయక్ కి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పార్వతి, కాలనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శివారెడ్డి, రామ్ రెడ్డి, వీరేందర్ తో పాటు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు



## ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎల్ బి నగర్ ఇంచార్జి మధుయాష్కి గౌడ్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో భాగంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి స్వయం ఉపాధి పథకం క్రింద ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ జరిగింది. శనివారం హయత్ నగర్ లోని స్థానిక చెన్నగోని స్వామి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మైనార్టీ మహిళ శక్తి పథకం లో భాగంగా సుమారు 207 మంది మైనారిటీ లబ్ధిదారులకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ చేసారు. హయత్ నగర్ కాంగ్రెస్ ఇన్చార్జి చెన్నగౌని రవీందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి,మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద మైనారిటీ మహిళల అభ్యున్నతికి సముచిత స్థానం కల్పించిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాలను అందిస్తుందని అన్నారు. తెలంగాణలో ప్రతి మైనారిటీ మహిళ స్వయం ఉపాధితో తన కాళ్ళ మీద తను నిలబడి ఆదర్శంగా ఉండాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని.. ఆది నుంచే తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తుందని.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన మైనారిటీ సంక్షేమ పథకాలను ఇతర అభివృద్ధి పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్ల కొత్వాల్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, పి సి సి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



# సౌమ్య మిశ్రా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

**కాప్రా జూన్, విశాలభారతి:**

ఎన్నో యేండ్ల నుండి చర్లపల్లి డివిజన్ సంబంధించిన కాలనీల కి చెందిన రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణ నగర్,మారర్ కాలనీ నుండి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షకాలం నుండి నీరు బయటికి పోలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జైల్ కి వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జైళ్ల డైరెక్టర్ జనరల్గా సౌమ్య మిశ్రా అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారం రోజుల క్రితం బిర్ అంబేద్కర్ సచివాలయం లో హెూం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలవగా వెంటనే సౌమ్య మిశ్రా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ ,రెడ్డి కాలనీ ప్రెసిడెంట్ భూమి రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, జీవన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెలుమ రెడ్డి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పసుమముల రామగిరి గుట్టపైకిరి ప్రదర్శన

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పసుమాముల గ్రామ లోని రామగిరి గుట్ట సీతారామచంద్రస్వామి ఆలయ గిరి ప్రదర్శనకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు, గత మూడు నెలల క్రితం శ్రీరామనవమి రోజు ఇక్కడ గిరి ప్రదర్శనకు ఆలయ చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి పాలకవర్గ సమక్షంలో ప్రారంభించడం జరిగింది, ఆలయంలోని మూల విరాట్ శ్రీరాముని జన్మ నక్షత్రం ప్రకారం ప్రతి నెల పునర్వసు నక్షత్రం రోజున గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జైపాల్ రెడ్డి తెలిపారు, ప్రతినెల గ్రామంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి గిరి ప్రదర్శన చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం
29.06.2025
హైదరాబాద్
4
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily
GENERAL NEWS

## యువకుడి అదృశ్యం



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:** పెద్ద అంబర్పేట్ కి చెందిన పండుగల మహేందర్ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ నందు జరిగింది.హయత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అంబర్పేట్ చెందిన పండుగల మహేందర్ (30) తండ్రి యాదయ్య వృత్తి రీత్యా డ్రైవింగ్ గా పని చేసేవాడని పండుగల మహేందర్ శుక్రవారం రోజు సాయంత్రం 5:00 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేనిది చూసి బయటకు వెళ్లినట్లు ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాకపోవడం తో అతని గురించి చుట్టు ప్రక్కల ప్రాంతాలలో, బంధువుల వద్ద స్నేహితులను అరతీయ్యగా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో పండుగల మహేందర్ తండ్రి యాదయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.




## శాంతియుత వాతావరణంలో బోనాల పండుగ జరుపుకోవాలి:

### బాలనగర్ ఏసిపి సురేష్ రెడ్డి, సీఐ నరసింహారాజు

**కూకట్ పల్లి విశాలభారతి:**

ఈనెలలో జరగనున్న ఆషాఢం బోనాల జాతరకు ఆలయ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని తొట్టెల,ఫలహారం బండ్ల ఊరేగింపులలో ఎలాంటి అవంచానియా సంఘటనలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పై బాలానగర్ పోలీసులు ఆలయ కమిటీ సభ్యులు,నిర్వాహకులతో శాంతి సమావేశం సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ ఏసీపీ పి. నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ స%శీ%స్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే బొనాల పండుగ సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని అమ్మవారి స్ఫూర్తితో అందరూ శాంతియుతంగా బోనాల జాతరను జరుపకోవాలని ఏసీపీ నరేష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సరితా పటేల్ రెడ్డి, హాజీ మియా, నర్సింహులు, పిఎస్ఐలు వెంకటేశం, వినోద్, ఏఎస్ఐ హనుమయ్య, ఇతర సిబ్బంది ఆలయ కమిటీ సభ్యులు, బోనాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# సీతారాములపై ఒట్టేసి చెప్పు..!

### కూకట్పల్లి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాధవరంకు కాంగ్రెస్ నేత ఎం.యుగంధర్ రెడ్డి సూటి ప్రశ్న


**కూకట్ పల్లి విశాలభారతి:**



బాలానగర్ ప్రాంత పేద ప్రజల పట్ల కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చిన్న చూపు చూస్తూ ఏమాత్రం పట్టించుకోకుండా తాను నివసించే కూకట్పల్లి ప్రాంతం వైపు అధికంగా శ్రద్ధ చూపిస్తున్నాడని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని గత సంవత్సరం నుండి నిధులు వేచించి 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కాకుండా,స్థలం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే చేసిన కృషి,బాలానగర్ లో 100 పడకల ఆసుపత్రి కట్టిస్తా అని చెప్పిన మాటపై ఎందుకు శ్రద్ధ చూపించలేదని మండిపడ్డారు.ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా బాలానగర్ లోని 47 ఎకరాల ప్రభుత్వ లీజు భూముల్లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కట్టిస్తానని అనేక ఎన్నికల బహిరంగ సభల్లో చెప్పడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.బాలానగర్ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఆసుపత్రిపై ప్రత్యేకమైన కృషి ఎందుకు చేయలేదని, సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తాను చెప్పేది అబద్ధం అయితే, బాలానగర్ లోని 47 ఎకరాల ప్రభుత్వ లీజు భూముల్లో 100 పడకల ప్రభుత్వం ఆసుపత్రి నిర్మిస్తా అని అనలేదని ఎమ్మెల్యే తన సొంత నిధులతో నిర్మించిన సీతారాముల వారి దేవాలయంపై ఒట్టు వేసి చెప్పాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆడుతున్న డ్రామాలను దయచేసి గమనించాలని కోరారు. బాలానగర్ లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించినట్లయితే స్థానిక పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే వేలాది మంది కార్మిక కుటుంబాలు వైద్యంకు నోచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.బాలానగర్ ప్రాంత పేద ప్రజలకు వైద్యం అక్కర లేదని కూకట్పల్లి లో ప్రభుత్వ ఆసుపత్రిని కట్టించడం ఎంత విడ్డూరంగా ఉందో బాలానగర్ ప్రాంత ప్రజలు దయచేసి గమనించాలన్నారు. కూకట్పల్లికి అంత శ్రద్ధ వహించినప్పుడు,బాలానగర్ కు ఎందుకు శ్రద్ధ తీసుకోలేదు,అంటే ఎమ్మెల్యేకు బాలానగర్ ప్రాంత ప్రజలు కూడా ఓట్లు వేసి గెలిపించలేదా అని ఆయన మండిపడ్డారు.

## ఆటో రిక్షాను ఢీకొట్టిన కంటైనర్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



ఆటో రిక్షాను ఢీ కొట్టిన కంటైనర్ లారీ డ్రైవర్ తన వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపి ఆటోరిక్షాను ఢీ కొట్టిన ఘటన అబ్దుల్లాపూర్మెట్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం లోని రామోజీ ఫిలిం సిటీ సమీపంలోని తదురావాలా ముందు టీజీ 07 టి 1 9 0 5 నెంబర్ కలిగిన ఆటో రిక్షాను ఢీకొట్టడం జరిగింది, డ్రైవర్ తన వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపి ఆటోరిక్షాను ఢీకొట్టడం జరిగిందని డ్రైవర్ తలపై ఇతర భాగాలపై తీవ్ర గాయాలు కావడంతో వ్యక్తిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

# వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**బోడుప్పల్, విశాలభారతి:**



ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని, దీంతో సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవించవచ్చని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. బోడుప్పల్ ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన సిమ్ లయన్ జిమ్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. ప్రస్తుతం యాంత్రిక జీవనంలో అనారోగ్య సమస్యలతో బాధపడొద్దంటే కనీసం ప్రతి రోజూ ఒక గంటపాటు వ్యాయాయం చేయడం తప్పని సరి అని సూచించారు. రోగం వచ్చిన తర్వాత బాధపడే కంటే ముందుగానే జాగ్రత్త పడడం ఉత్తమంగా ఆయన అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలంటే వ్యాయామం కచ్చితం అని తెలిపారు. బోడుప్పల్ ప్రాంతవాసుల కోసం ఇక్కడ సిమ్ లయన్ జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా జిమ్ యజమాని జయసింహారెడ్డిని అభినందించారు. నాయకులందరినీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పూలకండ్ల జంగారెడ్డి, హరినాథ్ రెడ్డి, దానగళ్ల యాదగిరి, రంజిత్ రెడ్డి, రాపోలు ఉపేందర్, చంచల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## భార్య భర్తల మధ్య గొడవ.. ఆత్మహత్య చేసుకున్న భార్య

**నేరేడ్మెట్, విశాలభారతి:**

భర్త చేసిన అప్పు.. భార్య చావుకు దారి తీసిందా ప్రేమించుకున్నారు.. పెద్దలను ఒప్పించి పెండ్లికూడా చేసుకున్నారు. భర్త చేసిన అప్పు వల్ల భార్య చావుకు కారణం అయ్యింది అంటున్నారు కుటుంబ సభ్యులు, పోలీసులు. నేరెడ్మెట్ పోలిస్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ కి చెందిన భార్గవి (30), అదే ఏరియాలో ఉండె భరత్ కుమార్ గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. దానితో ఇరువురు పెద్దలతో మాట్లాడి వారి సమక్షంలో పెండ్లి కూడా చేసుకున్నారు. పెళ్లి అయిన తరువాత ఇద్దరూ వెస్ట్ గాంధీ నగర్ నివాసముంటున్నారు. గత రాత్రి భార్య భర్తల మధ్య భరత్ చేసిన అప్పుల విషయంలో మాటా మాట పెరిగి గొడవకు దారి తీసింది. అదే రోజు రాత్రి భరత్ ఇంటి భయట నిద్రించగా.. భార్గవి ఇంట్లోనే నిద్రించింది. ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో భరత్ మెయిన్ డోర్ ఓపెన్ చేయడానికి ప్రయత్నించగా డోర్ ఓపెన్ అవ్వలేదు. దానితో వెంటనే తన తమ్ముడు హరీష్ బాబుని పిలిచి డోర్ బద్దలు కొట్టి చూడగా భార్గవి సీలింగ్ ఫ్యాన్ కి చున్నితో ఉరివేసుకుని కనిపించింది భార్గవి. భార్గవి తల్లి దారా జయ పోలీసులకు కంప్లైంట్ చేయడంతో అనుమానస్పద మృతి క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చస్తున్నామని నేరెడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపారు..

# బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

**చౌటుప్పల్,విశాలభారతి:**



మండలంలోని మల్కాపురం గ్రామం బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి భారీ చేరికలు. చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఎలవర్తి యాదగిరి,బిఆయస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఈద్దుల మస్తాన్ బాబు యాదవ్,ప్రధాన కార్యదర్శి మహంకాళి పృథ్వి,మాజీ వార్డు మెంబర్ మహంకాళి కృష్ణ,బిఆర్ యస్ సీనియర్ నాయకులు ఈద్దుల శ్రీశైలం,బోయిన వేంకటేష్,రవి,బాబు, కేశవ్, సైదులు,నర్సింహ్మా, చిట్టంపల్లి చంద్రశేఖర్,చింతపట్ల జగన్, నర్సింహ, భాస్కర్, లింగస్వామి, సురేష్ చారి, భూపాల్, రమేష్, అరుణ్, సంతోష్, భాస్కర్, గణేశ్, కార్తిక్, ఎస్ మహేష్,ఎం నవీన్,అర్జున్, నవీన్,విక్కీ,సురేష్,అజయ్,మహేష్ తదితరులు పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానించిన మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్,మాజీ మున్సిపాలిటీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్,మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్,మాజీ ఎంపిటిసి చిట్టంపల్లి శ్రీనివాస్,గ్రామ శాఖ అధ్యక్షులు మునుకుంట్ల రాజు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనారు.



## తిరుమలలో హైదర్ నగర్ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

### ఆకట్టుకున్న రుహని కూచిపూడి నృత్య అకాడమీ చిన్నారులు

కూకట్ పల్లి, విశాలభారతి: తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన మండపంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో హైదరాబాద్ చిన్నారుల కూచిపూడి నృత్యం పలువురుని ఆకట్టుకుంది. తిరుపతిలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ ఆస్థాన మండపంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నృత్య ప్రదర్శనలో నగరంలోని హైదర్ నగర్ రుహని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలో బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ సందర్భంగా రుహని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన మాట్లాడుతూ రుహని కూచిపూడి అకాడమీలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకున్న చిన్నారులు తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన మండపంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో అకాడమీ చిన్నారులు అద్భుతమైన ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. ఈ ప్రదర్శనలో చిన్నారుల తల్లిదండ్రులు, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులు

అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచామని సీఎం చంద్రబాబు తెలిపారు.వారంలో రూ.5,350 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలుస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు, విశాఖపట్నంలో చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్, పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉండవల్లి నివాసంలో సమీక్షకు మంత్రి నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. నెల్లూరు, రాజమండ్రి ప్లాంట్లకు టెండర్లు పూర్తి అయ్యాయని చెప్పారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ఎ÷-లాంట్లకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో ఆధునిక యంత్రాల కొనుగోలుకు రూ.225 కోట్లు కేటాయించామని తెలిపారు. వీలైనంత త్వరగా లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మున్సిపల్ శాఖలో అనేక అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మీడియాకు మంత్రి నారాయణ తెలిపారు. టిడ్కో ఇళ్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం 2014 నుంచి 2019 మధ్య కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక నిధులను తీసుకువచ్చామని వెల్లడించారు మంత్రి నారాయణ. రూ.5800 కోట్లు నిధులు, రూ.3000 కోట్ల స్వచ్ఛభారత్ నిధులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిందని మంత్రి నారాయణ గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిధులు నిలిచిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులను పరిష్కరించి కేందప్రభుత్వం నుంచి మళ్లీ నిధులు తీసుకువస్తున్నామని వివరించారు. అమృత్ స్కీమ్ ద్వారా తాగునీరు పైప్‌లైన్ పనుల కోసం నిన్ననే టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. ఈ పనులు పూర్తయితే 85 శాతం ప్రతి ఇంటికీ నేరుగా నదులు, కాలువల ద్వారా నీరు అందుతోందని అన్నారు. ౦ఎః నుంచి రూ.5350 కోట్లకు సంబంధించిన పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు మంత్రి నారాయణ. యా నిధులకు రాష్ట్ర వాటా ఇచ్చేలా ఆర్థిక శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. శుద్ధి చేసిన నీటిని డ్రైన్లలోకి వదిలేలా 2029లోగా వందశాతం ఃఖలు నిర్మిస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం వదిలేసిన లెగసీ వేస్ట్‌ను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2019 మధ్యలో 10 వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖపట్నం ప్లాంట్‌లలో 2800 టన్నుల చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్నారని మంత్రి నారాయణ చెప్పారు.